క్లుప్తంగా

ఘనంగా భావానంద భారతిస్వామి జయంతి



నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

మర్కూక్(గజ్వేల్): మండల పరిధిలోని పాండురంగ ఆశ్రమంలో యతివర భావానంద భారతి స్వామి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి రసరాజశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు పాదుక పూజ, పల్లకీసేవ, దీపారాధన, గోపూజలో పాల్గొన్నారు. పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 56 రకాల స్వీట్‌లను నైవేద్యంగా సమర్పించారు. ఆశ్రమ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై అప్రమత్తం

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని మిషన్ భగీరథ డీఈఈ రజీనా తస్కీన్ సూచించారు. నల్–జల్ పథకంలో భాగంగా నీటి సరఫరా సహాయకులకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీఈఈ మాట్లాడుతూ సింగిల్ ఫేజ్ విద్యుత్‌తో సరఫరా అయ్యే నీటి సరఫరా గురించి వివరించారు. పగిలిన పైపులైన్లను గుర్తించి నీరు కలుషితం కాకుండా చూడాలని చెప్పారు. ట్యాంకుల శుభ్రపరచడంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. అనంతరం శిక్షణ ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, గ్రామ నీటి సహాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈఈగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

దుబ్బాకటౌన్: రాయపోల్ విద్యుత్ శాఖ ఏఈఈగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో తొగుట మండలం ఏఈఈగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.

ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి: డీఈఓ



డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

దౌల్తాబాద్(దుబ్బాక): ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని జిల్లా విద్యాధికారి ఎల్లంకి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులలోని సృజనాత్మకత, వారి అభిరుచులను వెలికి తీయడంలో ఉపాధ్యాయులు ముఖ్య పాత్ర వహిస్తారన్నారు. అనంతరం డీఈఓను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ బి.భాగ్యలక్ష్మి, హెచ్‌ఎం ఎంఏ బాసిత్, ఉపాధ్యాయులు రాజేశ్వర్, మధుర కవి, శ్రీధర్, యాదగిరి, ఎస్.కిషన్ రెడ్డి, ఎస్.సత్యనారాయణ, ప్రకాశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు మేజిస్ట్రేట్ పూజలు



మల్లన్న సన్నిధిలో మేజిస్ట్రేట్ కాంతారావు

కొమురవెల్లి(సిద్దిపేట): న్యాయమూర్తి కాంతారావు కుటుంబ సమేతంగా శనివారం మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాన్ని వారికి అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలివేత

కొండపాక(గజ్వేల్): మండలంలోని బందారంలోని సబ్‌స్టేషన్ పరిధిలోని మరమ్మతుల కారణంగా బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా గ్రామాల గృహాలకు, వ్యవసాయ బావులకు ఆదివారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సత్యం తెలిపారు.

పారిశుద్ధ్యం.. అధ్వానం

- ఓపెన్ ప్లాట్లలో పెరిగిన పిచ్చిమొక్కలు
- నిత్యం పందుల సంచారం, విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



కడవేర్గు వెళ్లే దారిలో మురుగు నీటితో నిండిన కాల్వ

చేర్యాల(సిద్దిపేట): పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. కాలనీల్లోని ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, పొదలు ఏపుగా పెరిగాయి. దానికి తోడు మురుగు నీరు చేరి, పందులు సంచరిస్తున్నాయి. శివారుల్లోని డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలు విజృంభించడంతో పట్టణ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులు ఉన్నప్పటికీ పర్యవేక్షణ కరువైంది. మున్సిపల్ పాలక వర్గం, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ పరిధిలోని ప్రధాన ప్రాంతాలు, రోడ్ల వెంబడి మురుగు కాల్వలను మాత్రమే శుభ్రం చేస్తున్నారని, శివారు కాలనీలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దోమలు విజృంభిస్తున్నా పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయడంలేదు. ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇచ్చి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం..



పట్టణంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయిస్తున్నాం. ఓపెన్ స్థలాలను యజమానులు స్వచ్ఛందంగా తమ స్థలాలను శుభ్రం చేసుకోవాలి. అన్ని వార్డులో శానిటేషన్ పనులు చేయిస్తున్నాం. పందుల నివారణకై సంబంధిత పెంపకం దారులను హెచ్చరిస్తాం. ఇంకా ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించి చర్యలు తీసుకుంటాం. – నాగేందర్, కమిషనర్

హరితహారం.. వృథాగా ప్రజాధనం

- ముమ్మరంగా చెట్ల తొలగింపు
- ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికారులు
- చర్యలు తీసుకోవాలి: గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): అధికారుల అలసత్వంతో హరితహారం కార్యక్రమం నిర్వీర్యం అవుతోంది. ఆ కార్యక్రమంలో భాగంగా రూ.లక్షలు వెచ్చించి వేలాది మొక్కలను నాటారు. రోడ్డు పక్కన నాటిన మొక్కలను కొందరు తమ ఇష్టానుసారం నరికేస్తున్నారు. పచ్చదనం పరిశుభ్రతతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం హరితహారం కార్యక్రమంలో భాగంగా ఫారెస్టు అధికారుల ఆధ్వర్యంలో రాజీవ్ రహదారికి రెండువైపులా వివిధ రకాల మొక్కలు నాటారు. అవి చెట్లుగా పెరిగిన సమయంలో కొందరు ఆ లక్ష్యానికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసి జేసీబీలతో ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. తిమ్మారెడ్డిపల్లి శివారులో సుమారు 10నుంచి 15 చెట్లను తొలగించారు. అయినా అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్లను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఫారెస్టు సెక్షన్ అధికారి రమేశ్‌ను వివరణ కోరగా ఈ సమస్య తమ దృష్టికి రాలేదని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



చెట్లను తొలగించడంతో ఏర్పడిన గొయ్యి

సౌకర్యాలు కల్పించకపోతే ధర్నా

మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గర్భిణులతో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కేసీఆర్ కృషి ఫలితంగా నిర్మించిన మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి(ఎంసీహెచ్)లో పది రోజుల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించకపోతే మహిళలతో కలిసి ధర్నా చేపడతామని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆసుపత్రిని సందర్శించి గర్భిణుల ఇబ్బందులను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రి నిర్మాణం కోసం బీఆర్‌ఎస్ రూ.28కోట్లు, ఇతర వసతుల కోసం మరో రూ.10కోట్లు వెచ్చిందని గుర్తు చేశారు. మరికొన్ని చిన్న, చిన్న పరికరాలు ఆసుపత్రికి అందించి ప్రసవాలు జరిగేలా చర్యలు చేపట్టాల్సి ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖామంత్రి దామోదర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను వదిలిపెట్టి దందాల్లో మునిగితేలుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఆసుపత్రి సమస్యపై స్పందించాలని, లేనిపక్షంలో మహిళలతో కలిసి ఆందోళన చేస్తామని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, నవాజ్ మీరా, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, చందు, అహ్మద్, హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్



చిన్నకోడూరులో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఖరీఫ్‌లో రైతు భరోసా లేదని చెప్పడం రైతులను మోసం చేయడమేనని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు నిధులు విడుదల చేయబోమని చెప్పడంపై శనివారం చిన్నకోడూరులో రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు నిరసనకు దిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా ఎగ్గొట్టేందుకే మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, పాపయ్య, శ్రీహరి యాదవ్, ఉమేశ్ చంద్ర, మధుసూదన్‌రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. అలాగే నర్మేటలో బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు.

నిరసన కార్యక్రమాలు చేపట్టాలి
ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులను మోసం చేస్తోందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఆదరణ జీర్ణించుకోలేకే బీఆర్‌ఎస్ కుట్రలు

డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి



పార్టీలో చేరిన వారితో నర్సారెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లో వస్తున్న ఆదరణ జీర్ణించుకోలేక బీఆర్‌ఎస్ నేతలు కుట్రలు పన్నుతున్నారని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. అక్కారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆయన సమక్షంలో శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నేతలు తమ హయాంలో రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. మూసీ, హైడ్రా పేరుతో రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ఎన్ని కుట్రలు, దుష్ప్రచారాలను కొనసాగించినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని, అభివృద్ధిని అడ్డుకుంటున్న ఆ పార్టీకి ప్రజల మద్దతుతో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, యాదయ్య, గంగిశెట్టి రాజు, సమీర్, బోస్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ్ సిద్దిపేటకు సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: స్వచ్ఛ్ సిద్దిపేటకు అందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ కోరారు. స్థానిక ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డులో నాన్‌వెజ్ బ్లాక్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాంస విక్రయేతలు, ప్రజలతో పలు అంశాలపై మాట్లాడారు. నాణ్యమైన మాంసాన్నే విక్రయించాలని, స్లాటర్ హౌస్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ మాంసం వ్యర్థాలను వేయొద్దని, మార్కెట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు.

పనికోసం వెళ్లి అదృశ్యం



గణేశ్(ఫైల్)

సిద్దిపేటరూరల్: పని నిమిత్తం వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మాచాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని మచాపూర్‌కు చెందిన పిట్ల గణేశ్ గురువారం ఉదయం సిద్దిపేటకు పనికి వెళ్తానని చెప్పి వెళ్లాడు. భార్య జ్యోతి సాయంత్రం గణేశ్‌కు ఫోన్‌చేయగా పని చేస్తున్నా వస్తాను అని చెప్పాడు. రాత్రి 9 దాటినా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో ఆమె బంధువులు, స్నేహితులకు ఫోన్ చేయగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చికిత్స పొందుతూ మృతి

గజ్వేల్‌రూరల్: చికిత్స పొందుతూ ఓ ఆటో డ్రైవర్ మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌అండ్ ఆర్ కాలనీకి చెందిన కుంటి ప్రభాకర్(22) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగించేవాడు. కొంత కాలం క్రితం ఆటోను విక్రయించాడు. ఆర్థిక సమస్యలతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గత 15న తాను చనిపోతున్నానంటూ వాట్సాప్ స్టేటస్ పెట్టి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అది గుర్తించిన కుటుంబ సభ్యులు అతడిని వంటిమామిడిలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆకునూరు కార్యదర్శి సస్పెన్షన్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు పంచాయతీ కార్యదర్శి పులి బాలయ్యను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మహబూబ్ అలీ తెలిపారు. గ్రామంలో ఓ ఇంటి నిర్మాణం విషయంలో వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిన జిల్లా స్థాయి అధికారుల నివేదిక ఆధారంగా కార్యదర్శిపై చర్యలు తీసుకున్నట్టు ఆయన చెప్పారు.

తాళ్లకుంట చెరువు భూమిని సర్వే చేస్తాం

ఇరిగేషన్ డీఈ శ్యామ్



చెరువును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ శ్యామ్

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లోని తాళ్లకుంట చెరువు భూమిని సర్వే చేస్తామని ఇరిగేషన్ డీఈ శ్యామ్ చెప్పారు. ఇరిగేషన్ ఏఈ శశిధర్‌తో కలసి తాళ్లకుంట చెరువును శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాళ్లకుంట చెరువు శిఖంను కొందరు ఆక్రమించినట్లు తమకు ఫిర్యాదు అందిందన్నారు. దీంతో చెరువు భూమిని సర్వే చేయాల్సిందిగా రెవెన్యూ శాఖను కోరామని తెలిపారు. త్వరలోనే రెవెన్యూ శాఖతో కలసి చెరువుకు సంబంధించిన భూమికి హద్దులు ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. చెరువు భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లం బాలయ్య, దండు నర్సింహులు, బక్కి రాందాస్, మల్లం శేఖర్, రేగోటి చంద్రయ్య, పాశం చంద్రయ్య, దేవరాయ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలను ప్రోత్సహించండి

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



మంత్రిని కలిసిన వీసీ రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్): రాష్ట్రంలో రోజురోజుకు పెరుగుతున్న వరిసాగు విస్తీర్ణాన్ని తగ్గించడంతో పాటు ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వీసీకి సూచించారు. ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం నూతన వైస్‌చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ దండ రాజిరెడ్డి మంత్రిని శనివారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బహుళ పంటల సాగుతో రైతుల ఆదాయం పెరుగుతుందని, విశ్వవిద్యాలయం ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పళ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్య పంటలను మల్టీస్టోరీడ్ పద్ధతిలో సాగు చేసుకునేలా రైతులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. తక్కువ కాలంలోనే రైతుకు మంచి లాభాలు రావాలంటే ఉద్యాన పంటలే మార్గమని మంత్రి తెలిపారు.

విద్యార్థి దశ చాలా కీలకం: ఏసీపీ సతీశ్



మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్

హుస్నాబాద్/సిద్దిపేటజోన్: విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకున్నవారు ఉన్నతంగా ఎదుగుతారని ఏసీపీ సతీశ్ అన్నారు. మోడల్ స్కూల్‌లో మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుకునే సమయంలో ప్రేమ, పెళ్ళి అంటూ ఆకర్షణకులోనై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సైబర్ నేరాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేశ్, ప్రిన్సిపాల్ విశ్వనాథం, షీ టీమ్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సిద్దిపేటలో మెరీడియన్ పాఠశాల విద్యార్థులకు ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలు, నూతన చట్టాల గురించి త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ అవగాహన కల్పించారు. సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు.

వివరాల నమోదుతో ఎన్నో ప్రయోజనాలు

డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ప్రభుత్వం అందించే ఆరోగ్య పథకాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం ఆశా ఫీల్డ్ సర్వీస్ రిజిస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణుల ఆరోగ్య వివరాలు, చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాల వివరాలు, క్షయ ఇతర వ్యాధుల వివరాలను ఫీల్డ్ రిజిస్టర్‌లో విధిగా నమోదు చేయాలన్నారు. దీని వల్ల ముందస్తుగా ఆరోగ్య సమస్యలను తెలుసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆనంద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది నవీన్, రాజ్‌కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యారంగాన్ని భ్రష్టు పట్టించారు

హుస్నాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. అశోక్‌నగర్ ప్రాంతంలో గ్రూప్ వన్ పరీక్షను వాయిదా వేయాలని కోరినందుకు అభ్యర్థులపై పోలీసుల దాడిని ఖండించారు.

◆ పేదల్లో మనోధైర్యం నింపిన సహాయనిధి

కొండపాక(గజ్వేల్): సీఎంఆర్‌ఎఫ్ పేదల్లో మనోధైర్యాన్ని నింపుతోందని ఎన్‌ఆర్‌ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యురాలు కోల సద్గుణ అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లిలో రెడ్డమైన కొండయ్య, రెడ్డమైన రామయ్య, డి.ప్రభాకర్, కె.మహిపాల్, మల్లేశానికి మంజూరైన చెక్కులను శనివారం ఆమె అందజేశారు.

◆ కొనుగోలు కేంద్రాల కోసం వినతి

హుస్నాబాద్: పత్తి, ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆర్డీఓ రామ్మూర్తికి శనివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్ రెడ్డి వినతి పత్రం అందజేశారు. కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు మద్దతుధర పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పరశురాములు, హరీశ్, శ్యాంసుందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

◆ ఆంజనేయుడి ఆలయంలో చోరీ

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని కార్యాసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాండవుల చెరువుకట్టపై గల ఆ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు హుండీని పగులగొట్టి నగదు, స్పీకర్లను దొంగిలించి, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. మార్నింగ్ వాకింగ్ కోసం వచ్చిన పలువురు దొంగతనం జరిగిందని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ కొనుగోళ్లను ప్రారంభించండి

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని అన్ని గ్రామాల్లో వడ్ల కొనుగోలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంతో పాటు సలాఖపూర్ గ్రామాల్లో మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వరికుమార్, ఎండీ షఫీ తదితరులు పాల్గొన్నారు.

◆ పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి

వర్గల్(గజ్వేల్): తలకొక్కుల చంద్రకళ–లక్ష్మణ్ చారిటబుల్ ట్రస్ట్ పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తోందని ట్రస్ట్ చైర్మన్ లక్ష్మణ్ అన్నారు. శనివారం చౌదరిపల్లి ప్రభుత్వ పాఠశాలకు ఎల్‌ఈడీ టీవీ, స్క్రీన్ అందజేశారు. విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు, స్టడీ మెటీరియల్, నోట్‌బుక్స్, దుస్తులు అందజేస్తూ ప్రోత్సహిస్తున్నామన్నారు. దుర్గాప్రసాద్, మధుసూదన్, హెచ్‌ఎం జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ పిల్లల చదువులపై శ్రద్ధ అవసరం

కొండపాక(గజ్వేల్): తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య సూచించారు. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు ఇలాంటి సమావేశాలకు హాజరైనప్పుడే పాఠశాలల పనితీరులపై అవగాహన ఏర్పడుతుందని చెప్పారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందేలా హెచ్‌ఎంలు చూసుకోవాలని సూచించారు. హెచ్‌ఎంలు రాజ్‌బహదూర్, చీల రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ పేకాట స్థావరాలపై దాడి

నంగునూరు(సిద్దిపేట)/కోహెడరూరల్(హుస్నాబాద్): పేకాట స్థావరాలపై దాడిచేసి పలువురిపై కేసు నమోదు చేసినట్లు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్ శనివారం తెలిపారు. బద్దిపడగ గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నరనే సమాచారంతో సిబ్బందితో కలసి దాడులు చేశామని, పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.24, 480, బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. అలాగే కోహెడరూరల్ మండలంలోని నకిరేకొమ్ముల గ్రామంలో పది మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ అభిలాష్ తెలిపారు. రూ.3,500 సీజ్‌చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

◆ సామాజిక సేవలతోనే గుర్తింపు

మిరుదొడ్డి(దుబ్బాక): సామాజిక సేవలతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని అనంతరెడ్డి మెమోరియల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో, ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని అల్వాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరం నిర్వహించారు. పోలీస్ రాజులు, టి.రాజేంద్ర ప్రసాద్, దుర్గావాణి సురభి, పి.దిలీప్‌రెడ్డి, కిష్టయ్య, హెచ్‌ఎం పద్మజ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.